పేదల బాగుకోసం జగనే రావాలి..



కైలాసపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు



ప్రచారం సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి జోగులుకు బొట్టుపెట్టి విజయం మీదే అంటున్న చిన్నారి

కోటవురట్ల : పేదలు బాగుండాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగనే రావాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. ఎన్నికల ప్రచారం శనివారంతో ముగియడంతో ఆఖరి రోజున కైలాసపట్నంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీంతో మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో ఆయన ఎన్నికల ప్రచారాన్ని విజయవంతంగా ముగించారు. అన్ని గ్రామాలలోను ఆయనకు విశేష స్పందన వచ్చింది. కైలాసపట్నంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆయన ప్రచారంలో పాల్గొని వెంట నడిచారు. జగనన్న పాటలకు మహిళలు ఉత్సాహంగా డ్యాన్స్ చేశారు. జోగులు మాట్లాడుతూ ఐదేళ్లలో సీఎం జగన్ మేనిఫెస్టోను పూర్తిగా అమలు చేసి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించారన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలోనే నగదు జమచేసి వారికి ఆసరాగా నిలిచారన్నారు. విద్య, వైద్యం రంగాలను ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా నాడు-నేడు ద్వారా అద్భుతంగా అభివృద్ధి చెందిన పాఠశాలలు, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు ముచ్చటగా కనిపిస్తున్నాయని అన్నారు. సచివాలయ వ్యవస్థతో అన్ని సేవలు పల్లెల్లోనే లభిస్తున్నాయన్నారు. సీఎంగా మళ్లీ జగన్‌కు అవకాశం కల్పిస్తే ఇంతకన్నా అద్భుతంగా పాలన సాగిస్తారని, ఉత్తరాంధ్ర ఎంతగానో అభివృద్ధి చెందుతుందన్నారు. తనను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా మంచి మెజార్టీతో గెలిపిస్తే పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ జగన్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే అవ్వాతాతలకు భరోసా వస్తుందన్నారు. రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా కంబాల జోగులును, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కుమారరాజా, సిద్దాబత్తుల సత్యనారాయణ, నాగేశ్వరరావు, సర్పంచులు పి.నూకరత్నం,జగదీష్, ఎంపీటీసీ రమణ, రామునాయుడు, టి.నారాయణరావు, చామంతుల శ్రీనివాసరావు, ఎం.నానాజీ, సురేష్, డి.వి.రావు, వరహాలరావు, ఆంజనేయులు, పి.రాంబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

జనహోరు... గణేష్ జోరు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్



ప్రచార ర్యాలీకి భారీగా తరలివచ్చిన జనవాహిని

- హోరెత్తిన ఎన్నికల ప్రచార ర్యాలీ
- జనసంద్రంతో ఉప్పొంగిన నర్సీపట్నం
- మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరించండి
- వై.వి.సుబ్బారెడ్డి
- ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం : ప్రచార ర్యాలీలో కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో నర్సీపట్నం జనసంద్రంగా మారింది. వైఎస్సార్‌సీపీ అంటే అభిమానం...నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచార ర్యాలీకి గ్రామాలకు గ్రామాలే కదలి వచ్చాయి. ర్యాలీలో రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్, పార్టీ నాయకులు ప్రత్యేక రథంపై ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.

ర్యాలీ శనివారం సీబీఎం కాంపౌండ్ నుంచి పోలీసుస్టేషన్, అబిద్‌సెంటర్, పెదబొడ్డేపల్లి మీదుగా ఎమ్మెల్యే ఇంటి వరకు కొనసాగింది. మార్గమధ్యంలో అడుగడుగునా ఎమ్మెల్యే గణేష్, సుబ్బారెడ్డి మహిళలు, చిన్నారులు, యువతను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ర్యాలీలో గిరా గిరా తిరుగుతుంది ఫ్యాన్.. పాటకు మహిళలు డాన్స్‌తో హోరెత్తించారు. ర్యాలీని ఉద్దేశించి వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వర్షపు చినుకులు విజయానికి సూచిక అన్నారు. ల్యాండ్ టైట్‌లింగ్ యాక్టు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు అమలవుతుందన్నారు. ఈ చట్టం ద్వారా రైతుల భూములను రీ సర్వే చేసి హద్దులు నిర్ణయించడం జరుగుతుందన్నారు. ఈ చట్టం వల్ల నష్టం అని దుష్ప్రచారం చేస్తూ మరోవైపు ఇటీవల చంద్రబాబు వియ్యంకుడు బాలకృష్ణ విశాఖపట్నంలోనూ, అమరావతిలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ భూములు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుని పత్రాలు పొందారన్నారు. టీడీపీ, జనసేన నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. వారు ప్రకటించిన సూపర్ సిక్స్‌లు ఓటర్లను మభ్యపెట్టడానికే తప్ప నెరవేర్చేందుకు కాదని ఎద్దేవా చేశారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా సీఎం సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలతో కోట్లాది మంది లబ్ధి పొందుతున్నారన్నారు. జగనన్న ఇచ్చిన హామీ మేరకు నవరత్నాలను నూటికి నూరు శాతం నెరవేర్చారన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు ఆధునికీకరణతో పాటు గ్రామస్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా గణేష్, ఎంపీగా ముత్యాలనాయుడు భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నియోజకవర్గాన్ని వేల కోట్లతో అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుంటేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. 2019కి ముందు నర్సీపట్నం ఎలా ఉంది, ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలు గమనించాలన్నారు. నాడు-నేడు పథకంతో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో ఉన్నత విద్య చదువుకునేందు భరోసా కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి కాకుండా టీడీపీ, జనసేన, బీజేపీలకు ఓటేస్తే మీ పిల్లల భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ర్యాలీలో పార్టీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు, సినీ నటులు సాయిరామ్‌శంకర్, జోగినాయుడు, డాక్టర్లు లక్ష్మీకాంత్, కిల్లాడ సత్యనారాయణ, ఎఎంసీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, నాలుగు మండలాల ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, సాగిన లక్ష్మణమూర్తి, గజ్జలపు మణికుమారి, రుత్తల సత్యనారాయణ, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, కాపారపు అప్పలనర్స, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, లగుడు నాగేశ్వరరావు, లెక్కల సత్యనారాయణ, రుత్తల శ్రీనువాసరావు పాల్గొన్నారు.

చివరి రోజు ప్రచార హోరు

- ఎన్నికల ప్రచారానికి తెర

నక్కపల్లి : ఎన్నికల ప్రచారానికి తెరపడింది. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం శనివారం సాయంత్రం ఆరు గంటలకు అన్ని రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి స్వస్తి పలికాయి. దాదాపు 20 రోజులుగా గ్రామాల్లో హోరెత్తిన ఎన్నికల ప్రచారానికి తెరపడింది. పోటీలో ఉన్న అభ్యర్థులు తమ దైన శైలిలో ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రచారానికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది. పార్టీ అభ్యర్థి కంబాల జోగులు నాలుగు మండలాల్లో అన్ని గ్రామాల్లోను ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని నిర్వహించారు. ముగింపు రోజైన శనివారం నక్కపల్లిలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. ఈ ర్యాలీకి వందలాది మంది పార్టీ కార్యకర్తలు, మహిళలు తరలివచ్చారు. అనంతరం పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలనుద్దేశించి కంబాల జోగులు మాట్లాడారు. ఐదేళ్ల కాలంలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చి అక్క చెల్లెమ్మలను ఆర్థికంగా ఆదుకున్న ఘనత జగనన్నదేనన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం జగనన్న చేపట్టిన పథకాలన్నింటిని చంద్రబాబు కోర్టుల ద్వారా అడ్డుకుంటున్నాడన్నారు. వారిని మానసిక క్షోభకు గురిచేసాడన్నారు. అటువంటి వ్యక్తికి ఓటేస్తే ఈ పథకాలన్నీ రద్దవుతాయన్నారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ముత్యాల నాయుడిని గెలిపించాలన్నారు. ర్యాలీలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, వైస్ ఎంపీపీ నానాజీ, సర్పంచ్ రత్నకుమారి, ఉప సర్పంచ్ వీసం రాజు, మాజీ సర్పంచ్ తుమ్మా కల్పన, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, పార్టీ నాయకులు అల్లాడ కొండ, బంగార్రాజు, ఎల్లేటి సత్తిబాబు, ముద్దాశ్రీను పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు

క్లుప్తంగా

పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు



మండలంలో పోలింగ్ స్టేషన్‌కు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

ఎస్.రాయవరం : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పురస్కరించుకుని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. పోలింగ్ బూత్‌లలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వంద శాతం వెబ్ క్యాస్టింగ్ నిఘాలో పోలింగ్ జరగనున్నట్టు చెప్పారు. పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసి వెబ్ క్యాస్టింగ్ నేరుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి సమీక్షిస్తారన్నారు. అధికారులు , నాయకులు ఏ చిన్న పొరపాటు చేసినా వెంటనే తెలిసిపోతుందన్నారు. ఈ నిఘాతో పోలింగ్ ప్రశాంతంగా జరిగే అవకాశం ఉందని చెప్పారు.

600 లీటర్ల సారా పులుపు ధ్వంసం



పులుపు ధ్వంసం చేస్తున్న ఎస్ఐ కృష్ణారావు, సిబ్బంది

గొలుగొండ : నాటు సారా తయారీకి ఉపయోగించే సారా పులుపును గొలుగొండ పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. ముందస్తు సమాచారంతో ఏటిగైరంపేట ప్రాంతంలో ఎస్ఐ కృష్ణారావు దాడులు చేసి 600 లీటర్ల సారా పులుపు గుర్తించి ధ్వంసం చేశారు. సారా తయారు, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో గొలుగొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

12 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లిలో 12 మద్యం సీసాలను శనివారం స్వాధీనం చేసుకుని, ఇళ్లపు ఈశ్వరరావు అనే వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మద్యం సీసాలను అక్రమంగా విక్రయించడానికి తన ఇంట్లో నిల్వ ఉంచగా అతన్ని పట్టుకున్నామన్నారు.

మేమంతా వైఎస్సార్‌సీపీలోనే...

నక్కపల్లి : మేమంతా వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని, జగనన్న సంక్షేమ పథకాల వల్ల లబ్ధి పొందామని మళ్లీ జగనన్నను సీఎంను చేసుకుంటామని అమలాపురం, మూలపర గ్రామాలకు చెందిన పలువురు కార్యకర్తలు తెలిపారు. తమను వైఎస్సార్‌సీపీ మీటింగ్ ఉందని చెప్పి కొంతమంది టీడీపీ సమావేశానికి తీసుకెళ్లి ఆ పార్టీ కండువాలు కప్పారని వారు ఆరోపించారు. ఇలా టీడీపీ కండువాలు వేసుకున్న వారంతా శనివారం వైఎస్సార్ సీపీ నాయకుడు సూరాకాసుల గోవిందు , వంకా కృష్ణల వద్దకు వచ్చి పార్టీ కండువాలు కప్పుకుని మేమంతా పార్టీలోనే కొనసాగుతున్నామని ప్రకటించారు. గ్రామానికి చెందిన పారాజోగులు అనే వ్యక్తి మహిళల సమావేశం ఉందని చెప్పి తమను టీడీపీ అభ్యర్థి అనిత ఇంటికి తీసుకెళ్లాడన్నారు. ఆయన పార్టీ కండువాలు కప్పి తమకు కూడా బలవంతంగా టీడీపీ కండువాలు కప్పించాడని పారా లోవరాజు, చిట్టిమని రాంబాబు, రాకాతి రమణ, ఒరిపిల్లి దార్లు , మేడిశెట్టి రాము, పారా అప్పలరాజు, బత్తిన కనకరాజు, మోజేస్, రాకాతి సింహచలం, సూరాడ దుర్గమ్మ, తదితరులు తెలిపారు. వీరంతా తమ కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నామని, జగనన్నకే అండగా నిలుస్తామన్నారు.



గోవిందు సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్న మూలపర గ్రామస్తులు

పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమలు

నాతవరం : పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ ఎన్. రమేష్ కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు కమిషనర్ ఆదేశాల ప్రకారం పోలింగ్ ముగిసేంత వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. మండలంలో ఎలాంటి సభలు సమావేశాలు నిర్వహించరాదని, పార్టీ జెండాలు ప్రదర్శించరాదని, గుంపులుగా జనం ఉండరాదన్నారు. ఈ విషయంపై ప్రజలకు విస్తృతంగా తెలియజేసి ప్రశాంతంగా పోలింగ్ జరిపించేందుకు అధికారులు తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్ఐ రామారావు మండల వ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాలు అక్కడ పోలీసులు తీసుకున్న చర్యలు పట్ల వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాగరపు రాంబాబు ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు తాండవ ప్రాజక్టు జేఈ శ్యామ్‌కుమార్ వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల నిబంధనలు వివరిస్తున్న ఎస్ఐ రామారావు

ర్యాలీకి భారీగా తరలిన శ్రేణులు



తూటిపాల నుంచి భారీగా తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మాకవరపాలెం: నర్సీపట్నంలో నిర్వహించిన సిద్ధం ర్యాలీకి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్‌గణేష్ శనివారం భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీకి ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లడంతో రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి.

నాతవరం: ఎన్నికలు ప్రచారం ఆఖరు రోజు శనివారం నర్సీపట్నంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీకి భారీగా తరలి వెళ్లారు. మండలంలో 31 పంచాయతీలు నుంచి అధిక సంఖ్యలో మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఉత్సాహంగా వెళ్లడంతో వైఎస్సార్‌సీపీలో మరింత జోష్ కన్పించింది. జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ ఆటోలు, ద్విచక్ర వాహనాలపై తండోప తండోలుగా జనం తరలి వెళ్లారు.



నర్సీపట్నంలో ర్యాలీకి ఉత్సాహంగా వెళ్తున్న నాతవరం మండల వైఎస్సార్‌సీపీ శ్రేణులు


ఓటు వినియోగంపై అవగాహన



ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో జాగరపు రాంబాబు

నాతవరం : ప్రతి ఒక్కరూ ఓటు విలువను తెలుసుకుని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో జాగరపు రాంబాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి ఒక్కరూ ఓటును నిర్భయంగా వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేసుకోవాలన్నారు. ఓటు ఉన్న ప్రతి ఒక్కరికీ సచివాలయ ఉద్యోగుల ద్వారా ఓటు వేసేందుకు స్లిప్పులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పలువురు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీయం మర్రి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, వీఆర్వో బొత్సా శ్రీను పాల్గొన్నారు.

ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



స్క్రీనింగ్ పరీక్ష చేస్తున్న వైద్యులు శైలజ నమిత

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా వయసుతో సంబంధం లేకుండా ఏడాదికి మూడు సార్లు క్యాన్సర్ పరీక్షలు చేసుకోవాలని అగనంపూడి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు దరున్ ప్రసాద్, శైలజ నమితలు తెలిపారు. మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో శంక రంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్యపరీక్షలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాతావరణలో మార్పులు, ప్లాస్టిక్ ఎక్కువగా వినియోగించడం వల్ల క్యాన్సర్ వ్యాధి బారినపడే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్టు చెప్పా రు. మొదటి దశలో క్యాన్సర్‌ను గుర్తించి,సకాలంలో మందులు వాడడంతో ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. అంతకు ముందు ఈశిబిరంలో 40 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు షామీ మ్, ఆస్పత్రి సూపర్‌వైజర్ బి.సంఘం, ఎంఎల్‌హెచ్‌పీ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం



పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం నక్కపల్లి జూనియర్ కళాశాల వద్ద ఏర్పాట్లు



ఆర్‌వో గీతాంజలి

నక్కపల్లి : సార్వత్రిక ఎన్నిలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 13వ తేదీన జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి గీతాంజలి తెలిపారు. సోమవారం జరిగే పోలింగ్‌కు ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసేందుకు నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు వచ్చే సిబ్బందికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలింగ్ సామగ్రి పంపిణీ చేసేందుకు షామియానాలు, ప్రత్యేక కౌంటర్లు అల్పాహారం, భోజన సదుపాయాలను సయితం ఏర్పాటు చేస్తున్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో మొత్తం నాలుగు మండలాల్లో పోలింగ్ స్టేషన్లు 292 ఉన్నాయి ఓటర్ల వివరాలిలా ఉన్నాయి.

నియోజకవర్గాన్ని 28 రూట్లు, 28 జోన్‌లు, 28 సెక్టార్లుగాను విభజించి ఒక్కొక్క రూట్,జోన్, సెక్టార్‌కు ఒక అధికారిని నియమించడం జరిగిందన్నారు. మొత్తం 1610 మంది సిబ్బంది పీవో, ఏపీవో , ఓపీవోలుగా ఎన్నికల విధుల్లో పాల్గొంటున్నారన్నారు. పోలింగ్ ఈనెల 13న ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందన్నారు. ఎన్నికల సిబ్బందితో పాటు ఎన్ఎస్ఎస్ విభాగం వారిని కూడా ఉపయోగించుకోవడం జరుగుతోందన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సివిల్ పోలీసులతోపాటు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్సు, కేంద్ర రక్షణ బలగాలను సయితం బందోబస్తు కోసం వినియోగిస్తున్నామన్నారు. పోలింగ్ ఏజెంట్ల వివరాలు ఆయా పీఎస్‌లు, పీవోలకు అందజేయాలన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు.

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నక్కపల్లి	32426	32863	--	65289
కోటవురట్ల	21705	22754	--	44459
పాయకరావుపేట	39518	39958	--	79476
ఎస్.రాయవరం	29714	31804	02	61520
మొత్తం	123363	127379	02	250744

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయం

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం ఖాయమని వైఎస్సార్‌సీపీ నేత ఆడారి కిషోర్ కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ గతంలో మంత్రిగా ఉండగా అనకాపల్లికి చేసింది ఏమీలేదని, జనసేనకు ఓటు వేస్తే అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. బ్యాంకులకు టోకరా వేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా లోకల్ వ్యక్తికి టిక్కెట్ ఇవ్వాలని కోరిన అయ్యన్నపాత్రుడు ఇప్పుడు సీఎం రమేష్‌కు ఎందుకు మద్దతు ఇస్తున్నారో చెప్పాలని ప్రశ్నించారు. 2014ఎన్నికల్లో టీడీపీ 600 బూటకపు హామీలతో మేనిఫెస్టో విడుదల చేసిందని, అధికారం చేపట్టిన తరువాత చెత్తబుట్టలో వేసింది చెప్పారు. ప్రస్తుత టీడీపీ మేనిఫెస్టోను బీజేపీ వ్యతిరేకించిందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్ద శ్రీను, యల్లపు గాంధీ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆడారి కిషోర్‌కుమార్

బంగారం, వెండి చోరీ

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు లక్ష్మీనారాయణనగర్‌లో ఈనెల 9న రెండుతులాల బంగారం, 50 తులాలవెండి చోరీకి గురైనట్టు ఎస్ఐ మహ్మద్‌అలీ తెలిపారు. లక్ష్మీనారాయణనగర్‌లోని తన ఇంట్లో గ్రంధి శశిక్రాంత్ గుప్త ఈ నెల 9న నిద్రిస్తుండగా, మరో గదిలో కిటికీ ఐరన్‌గ్రిల్స్ తొలగించి ఇంటిలోకి దొంగలు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఎన్నికల సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలని వినతి



సీపీవో రామారావుకు వినతిపత్రం అందిస్తున్న పీఆర్టీయూ నాయకులు

తుమ్మపాల: ఎన్నికల విధులకు హాజరవుతున్న ఉద్యోగ,ఉపాధ్యాయులందరికీ సౌకర్యాలు కల్పించాలని పీఆర్టీయూ నాయకులు శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల సిబ్బంది డ్యూటీ పడిన ప్రాంతానికి వెళ్లి, రావడానికి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. బస్సుల రాకపోకలపై పూర్తి వివరాలతో ఆర్టీసీ అధికారుల నుంచి అప్‌డేట్ ఇవ్వాలన్నా రు. సామగ్రి ఇచ్చే సమయంలో, తిరిగి పుచ్చుకునే సమయంలో ఎన్నికల సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల విధుల్లో హాజరయ్యే సిబ్బందికి వెంటనే డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు డి.గోపినాథ్, ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, జిల్లా నాయకులు గంట్ల కృష్ణ, అలంక ప్రసాద్, రామకృష్ణ పాల్గొన్నారు.

లారీ బోల్తా: ట్రాఫిక్‌కు అంతరాయం

చింతపల్లిరూరల్: మండలంలో లంబసింగి ఘాట్ రోడ్డులో లారీ బోల్తా పడింది.చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళ్తున్న లారీ బ్రెకులు ఫేయిలవడంతో అదుపు తప్పి బోల్తా పడింది. సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. లారీ రోడ్డుకు మధ్యలో పడిపోవడం వల్ల రాకపోకలు నిలిచిపోయి, వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎట్టకేలకు ఎస్ఐ అరుణ్‌కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు యంత్రాల సాయంతో వాహనాన్ని పక్కకు తీయించి, ట్రాఫిక్ క్లియర్ చేశారు.



బోల్తా పడిన లారీ